అక్షర దర్బార్

www.aksharadarbar.com

voice of the people

వెల ₹5

మంగళవారం 18, ఫిబ్రవరి 2025 | సంపుటి :02 | సంచిక :10 | పేజీలు :05

నాణ్యత లేని బియ్యంపై ఆరా

- చలపర్తి గోదాములో నాణ్యతలేని బియ్యం వెలుగు చూడడంపై విస్మయం
- ఎంతకాలం నుంచి ఈ దందా సాగుతుందని సమాచార సేకరణ
- బియ్యం సిగ్రిగేషన్ జరుగుతున్నట్లు చెబుతున్న సివిల్ సప్లై అధికారులు

03

భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతం చేయాలి

- అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

05

లంచగొండి
ఖాకీలు

- ఏసీబీ వలలో ముగ్గురు పోలీసులు
- ఇద్దరు ఫారెస్ట్ అధికారులు
- రూ. 20 వేలు తీసుకుంటూ పట్టుబడిన మక్తల్ సీఐ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు శివారెడ్డి, నరసింహ
- రూ. 30 వేలు పుచ్చుకుంటూ అడ్డంగా బుక్కైన కొమురారం రేంజర్ ఉదయ్‌కిరణ్, బీట్ ఆఫీసర్ హరిలాల్
- ఒక్క రోజే ఐదుగురు ఉద్యోగుల ఆటకట్టు..
- గత నెలలో పట్టుబడిన తొర్రూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్..
- కలకలంరేపుతున్న అవినీతి నిరోధక శాఖ దాడులు
- అయినా మారని లంచావతారులు

అవినీతి అధికారులపై ఏసీబీ కొరడా ఝుళిపిస్తోంది. లంచావతారుల భరతం పడుతూ ఆటకట్టిస్తోంది. ఇటీవల వరుస సోదాలు, ఆకస్మిక దాడులతో అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టిస్తోంది. అయితే.. అధికారులు ఎన్ని దాడులు చేస్తున్నా.. లంచగొండి ఆఫీసర్లలో మాత్రం మార్పు రావడంలేదు. ఏదో ఒకచోట ఏసీబీ వలకు చిక్కుతూనే ఉన్నారు. తాజాగా సోమవారం రాష్ట్రంలో ఐదుగురు ఉద్యోగులు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నారాయణపేట జిల్లా మక్తల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు శివారెడ్డి, నరసింహతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ఫారెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని కొమురారం రేంజర్ ఉదయ్‌కిరణ్, బీట్ ఆఫీసర్ నునావత్ హరిలాల్ ఏసీబీకి చిక్కడం కలకలం రేపింది.

- అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

03

పున్నేలు వద్ద లేఅవుట్ వెంచర్ ఎదుట ధ్వంసమైన మత్తడి నీరు ప్రవహించే కుంట ఇరిగేషన్ ఛానల్

బఫర్ జోన్‌లో
లేఅవుట్ వెంచర్!

పున్నేలు వద్ద ఓ కుంట కట్టను ఆనుకుని వెంచర్ ప్లాటు, ప్రహరీ గోడ

- కట్ట నుంచి ఐదు మీటర్ల వరకు బఫర్ జోన్ అనే నిబంధనకు పాతర
- అడ్డుకోవాల్సిన నీటిపారుదల శాఖ ఈ వెంచర్ కు ఎన్‌ఓసీ జారీ
- వెంచర్ లోని ప్లాట్ల సేల్.. ఓ ఉన్నతాధికారి సైతం ప్లాట్ కొనుగోలు!
- వరంగల్ - ఖమ్మం హైవే సమీపంలో పున్నేలు వద్ద నెలకొన్న పరిస్థితి ఇది

వరంగల్ - ఖమ్మం హైవేలో రియల్ ఎస్టేట్ బిజినెస్ జోరుగా సాగుతుంది. ప్రధానంగా మామునూరు ఎయిర్ పోర్ట్ ను దృష్టిలో పెట్టుకొని రియల్టర్లు ఈ హైవేపై ఫోకస్ పెట్టారు. వరంగల్ మహా నగరం నుంచి దాదాపు వర్ధన్నపేట వరకు హైవేకు ఇరు పక్కల, సమీపంలో ఉన్న వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చుతున్నారు. కొందరు కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) నుంచి అనుమతులు పొంది లేఅవుట్ వెంచర్లు చేస్తుండగా మరికొందరు కుడా అనుమతులు లేకుండా నాన్ లేఅవుట్ వెంచర్లు నిర్మిస్తున్నారు. ఇంకొందరు వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములు (నాలా కన్వర్షన్)గా మార్చుతూ ప్లాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో అధిక లాభాలు కోసం గడించడమే లక్ష్యంగా ప్రభుత్వ నిబంధనలకు పాతరేస్తున్నారు. చెరువులు, కుంటల ఎఫ్ టీఎల్, బఫర్ జోన్లలో దర్జాగా వెంచర్లు నిర్మిస్తున్నారు. లేఅవుట్ వెంచర్లను సైతం చెరువులు, కుంటల స్థలాలను కబ్జా చేసి ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ లో రూపొందించి ప్లాట్లు, ప్రహరీ గోడలు, ఇతర నిర్మాణాలు చేస్తున్నారు. అడ్డుగా ఉన్న ఇరిగేషన్ ఛానల్స్ నూ ధ్వంసం చేస్తున్నారు. ఈ హైవేకు సమీపంలో హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామం వద్ద ఇదే జరిగింది. ఇక్కడ బఫర్ జోన్ లోకి వచ్చిన లేఅవుట్ వెంచర్ కు నీటి పారుదల శాఖ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) జారీ చేయడం విశేషం.

-అక్షరదర్బార్, హనుమకొండ

02

కారులో వర్గపోరు

- పరకాల బీఆర్ఎస్‌లో గందరగోళం
- ఎవరికి వారే చందంగా నేతల తీరు
- జూనియర్ల పై గుర్రుగా సీనియర్లు
- కేసీఆర్ బర్త్ డే నాడైనా కలవని నాయకులు
- ఇలా అయితే స్థానిక ఎన్నికల్లో కష్టమే ?

04



ఎస్సై వేధింపులు తట్టుకోలేం..

- ఆత్మహత్యకు అనుమతివ్వండి
- భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట దంపతుల ఆందోళన
- గతంలోనూ ప్రజాదర్బార్‌లో బాధితుల ఫిర్యాదు
- మూడేండ్లుగా వ్యవసాయం చేయనివ్వడంలేదని ఆరోపణ
- అక్రమ కేసులు పెడుతున్నాడని ఆవేదన
- ఇప్పటికైనా న్యాయం చేయాలని వేడుకోలు

05

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

నీళ్లొస్తాయని తెలిసి మొసలి కన్నీరు..

- రైతుల కష్టాలు తెలిసిన నేత సత్యనారాయణరావు
- కాంగ్రెస్ టేకుమట్ల మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్

అక్షర దర్బార్, టేకుమట్ల: భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చలివాగులోకి సాగునీరు తెప్పిస్తున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కొంతమంది బీఆర్ఎస్ నాయకులతో వాగు వద్దకు వెళ్లి మొసలి కన్నీరు కార్చడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ అన్నారు. మంగళవారం టేకుమట్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం చలివాగులోని చెక్ డ్యాం వద్దకు మాజీ ఎమ్మెల్యే రమణారెడ్డి వెళ్లి రైతులపై లేని ప్రేమను చూపించడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం అని, బీఆర్ఎస్ ప్రభుత్వం పెంచి పోషించిన దళారీ వ్యవస్థను రద్దు చేసింది ప్రజా ప్రభుత్వమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీ నెర వేరుస్తుందని, అధికారం కోల్పోయి ఆందోళనలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు మాట్లాడే ముందు ప్రస్తుత పరిస్థితికి కారకులు ఎవరో ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. విచ్చలవిడిగా ఇసుక క్వారీలు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వ, రమణారెడ్డి కాదా అని ప్రశ్నించారు. లేనిపోని విమర్శలు చేస్తూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని బదనాం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బంద శ్రీకాంత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కోటగిరి సతీష్ గౌడ్

లేఅవుట్ వెంచర్!

- పున్నేలు వద్ద ఓ కుంట కట్టను ఆనుకుని వెంచర్ ప్లాటు, ప్రహరీ గోడ
- కట్ట నుంచి ఐదు మీటర్ల వరకు బఫర్ జోన్ అనే నిబంధనకు పాతర
- అడ్డుకోవాల్సిన నీటిపారుదల శాఖ ఈ వెంచర్ కు ఎన్ఓసీ జారీ
- మత్తడి నీరు ప్రవహించే ఇరిగేషన్ చానలూ వెంచర్ ఎదుట ధ్వంసం
- వెంచర్ లోని ప్లాట్ల సేల్. ఓ ఉన్నతాధికారి సైతం ప్లాట్ కొనుగోలు!
- వరంగల్ - ఖమ్మం హైవే సమీపంలో పున్నేలు వద్ద నెలకొన్న పరిస్థితి ఇది

అక్షరదర్బార్, హనుమకొండ : వరంగల్– ఖమ్మం హైవేలో రియల్ ఎస్టేట్ బిజినెస్ జోరుగా సాగుతుంది. ప్రధానంగా మామునూరు ఎయిర్ పోర్ట్ ను దృష్టిలో పెట్టుకొని రియల్టర్లు ఈ హైవేపై ఫోకస్ పెట్టారు. వరంగల్ మహా నగరం నుంచి దాదాపు వర్దన్నపేట వరకు హైవేకు ఇరుపక్కల, సమీపంలో ఉన్న వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చుతున్నారు. కొందరు కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) నుంచి అనుమతులు పొంది లేఅవుట్ వెంచర్లు చేస్తుండగా మరికొందరు కుడా అనుమతులు లేకుండా నాన్ లేఅవుట్ వెంచర్లు నిర్మిస్తున్నారు. ఇంకొందరు వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములు (నాలా కన్వర్షన్)గా మార్చుతూ ప్లాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో అధిక లాభాలు కోసం గడించడమే లక్ష్యంగా ప్రభుత్వ నిబంధనలకు పాతరేస్తున్నారు. చెరువులు, కుంటల ఎఫ్ టీఎల్, బఫర్ జోన్లలో దర్జాగా వెంచర్లు నిర్మిస్తున్నారు. లేఅవుట్ వెంచర్లను సైతం చెరువులు, కుంటల స్థలాలను కబ్జా చేసి ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ లో రూపొందించి ప్లాట్లు, ప్రహరీ గోడలు, ఇతర నిర్మాణాలు చేస్తున్నారు. అడ్డుగా ఉన్న ఇరిగేషన్ ఛానల్స్ నూ ధ్వంసం చేస్తున్నారు. ఈ హైవేకు సమీపంలో హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామం వద్ద ఇదే జరిగింది. ఇక్కడ బఫర్ జోన్ లోకి వచ్చిన లేఅవుట్ వెంచర్ కు నీటి పారుదల శాఖ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) జారీ చేయడం విశేషం.

- ఏం జరిగిందంటే

వరంగల్– ఖమ్మం హైవే సమీపంలో పున్నేలు గ్రామం వద్ద గతంలో ఉన్న ఓ వెంచర్ పక్కన కొత్తగా మరో భారీ లేఅవుట్ వెంచర్ వెలిసింది. ఓ కుంటను ఆనుకొని సుందరంగా రూపుదిద్దుకున్న ఈ వెంచర్ నిర్మించిన వారు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కారు. నిబంధనల ప్రకారం 3.40 మీటర్ల ఎత్తులోపు కట్ట కలిగి ఉన్న ఈ కుంట కట్ట నుంచి ఐదు మీటర్ల వరకు బఫర్ జోన్ పరిధిలోకి వస్తుంది. అయితే వెంచర్ యజమానులు కుంట కట్ట చివరన మత్తడి సమీపంలో బఫర్ జోన్ పరిధిలోకి వచ్చేలా ఈ వెంచర్ నిర్మించారు. కట్ట వరకు బఫర్ జోన్ పరిధిలో ప్రహరీ గోడ నిర్మించారు. అంతేకాదు వెంచర్ లోని ఓ ప్లాట్ కూడా బఫర్ జోన్ పరిధిలోకి వచ్చింది. దీనిపై ఫిర్యాదులు అందినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఒక దశలో వెంచర్ లోని ఓ ప్లాటు, వెంచర్ ప్రహరీ గోడ బఫర్ జోన్ పరిధిలో నిర్మాణం జరిగిందని పరిశీలనలో వెల్లడైనప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో ఎంచక్కా వెంచర్ యజమానులు ఇందులోని ప్లాట్లను సేల్ చేస్తున్నారు. విచిత్రమేమిటంటే ఈ వెంచర్ లోని ప్లాట్లను వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు కొందరు కొన్నారు. ఇటీవల వరంగల్ జిల్లాకు చెందిన ఓ ఉన్నతాధికారి కూడా ఓ ప్లాట్ ను కొన్నట్లు తెలిసింది. ఇదే అదనుగా యజమానులు ఈ వెంచర్ లోని ప్లాట్లను మరింత రేటు పెంచి విక్రయిస్తున్నారు.

ఇరిగేషన్ ఛానల్ ధ్వంసం

ఈ భారీ లేఅవుట్ వెంచర్ ఎదుట ఉన్న కుంట మత్తడి నీరు ప్రవహించే ఇరిగేషన్ చానల్ సైతం ధ్వంసమైంది. వెంచర్ ప్రధాన ద్వారం ఎదుట ఇరిగేషన్ ఛానల్ పై పైపులను ఏర్పాటు చేసి రహదారి నిర్మించారు. ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిసిన సమయంలో కుంట నీటితో నిండి రోజుల తరబడి మత్తడి దుంకితే వేగంగా వచ్చే ఆ నీరు వెంచర్ ఎదుట ఇరిగేషన్ చానల్ పై ఏర్పాటు చేసిన పైపుల ద్వారా ఆటంకం లేకుండా బయటకు వెళ్లి పోతుందా అనే స్థానికుల ప్రశ్నకు అధికారుల నుంచి జవాబు లేదు. వెంచర్ అవతల మత్తడి నీరు ప్రవహించే ఇరిగేషన్ ఛానల్ యధావిధిగా ఉంది. కానీ మత్తడి ముందు ఆరంభంలో వెంచర్ ఎదుట ఉన్న ఇరిగేషన్ చానల్ ధ్వంసం కావటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే కుడా అనుమతులతో వెలసిన ఈ వెంచర్ లో నిబంధనలకు విరుద్ధంగా బఫర్ జోన్ లో నిర్మాణాలు జరిగితే అడ్డుకోవాల్సిన నీటిపారుదల శాఖ ఎన్ఓసీ జారీ చేయటాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అభ్యంతరం చెప్పాల్సిన అధికారులే ఎన్ఓసీ జారీ చేయడం ఇక్కడ చర్చనీయమైంది. దీనిపై ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్ ను 'అక్షరదర్బార్' వివరణ కోరగా తాను ఇక్కడకు రావడానికంటే 2021కి ముందే ఈ వెంచర్ వెలిసిందని, ఎన్ఓసీ కూడా అప్పుడే జారీ కావచ్చని, బఫర్ జోన్, ఎఫ్ టీఎల్ నిర్ధారణకు మార్కింగ్ కోసం ప్రభుత్వాన్ని కోరే ఏర్పాట్లలో ఉన్నామని చెప్పారు.

రేపటి సంచికలో మరిన్ని వివరాలు.

పోలీస్ అంజయ్యను అభినందించిన ఎస్పీ

అక్షర దర్బార్,తొర్రూరు : రెండు నెలల పాటు ఇంటిగ్రేటర్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో ఎస్పీ రామకృష్ణ ఇంటలిజెన్స్ సెక్యూటీ వింగ్ ఆధ్వర్యంలో ట్రైనింగ్ తీసుకుని ఈనెల ఫిబ్రవరి 10 నుండి15 తారీన ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగిన 68వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ లో ఆంటీ సబటేజ్ చెక్ రూమ్ సర్చ్ విభాగం వివిఐపి, విఐపి నివాసం ఉండే రూంను ఎలాంటి హానికర వస్తువులు లేకుండా చూసుకునే విధానంలో తెలంగాణ తరుపున పాల్గొన్న అంజయ్యకు సిల్వర్ మెడల్ ఝార్ఖండ్ ఐజి ఎస్.కే సిహ్నా చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా అంజయ్యకు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్, రిజర్వు డిఎస్పి శ్రీనివాస్, విజయ్ ప్రతాప్, అడ్మిన్ రిజర్వు ఇన్ స్పెక్టర్ అనిల్ కుమార్,

అంజయ్యను సన్మానిస్తున్న ఎస్పీ

బాంబు స్క్వాడ్ సిబ్బంది ఆంజయ్యకు అభినందనలు తెలిపారు.

నాణ్యత లేని బియ్యంపై ఆరా

- చలపర్తి గోదాంలో నాణ్యతలేని బియ్యం వెలుగు చూడడంపై విస్మయం
- ఎంతకాలం నుంచి దందా సాగుతుందని సమాచార సేకరణ
- బియ్యం సిగ్రిగేషన్ జరుగుతున్నట్లు చెబుతున్న సివిల్ సప్లై అధికారులు

అక్షరదర్బార్, వరంగల్ : చలపర్తి గోదాంలో నాణ్యతలేని బియ్యం వెలుగులోకి రావడంపై ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వ నిఘా విభాగాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం. రైస్ మిల్లర్లు ఎంత కాలం నుంచి నాణ్యతలేని బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ గోదాములకు సీఎంఆర్ గా డెలివరీ చేస్తున్నారు, పరీక్షలు చేయకుండానే వీటిని పాసింగ్ చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)లు ఎవరు, ఇందులో పౌరసరఫరాల సంస్థలోని అధికారుల్లో ఎవరెవరి పాత్ర ఎంత ఉంది అనే కోణంలో సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలిసింది. నాణ్యత లేని బియ్యం డెలివరీ అయ్యాయనే సమాచారంతో కొద్దిరోజుల క్రితం దుగ్గొండి మండలం చలపర్తి గ్రామంలో పౌరసరఫరాల సంస్థ నిర్వహిస్తున్న గోదాంలో కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, టాస్క్ ఫోర్స్ పోలీసులు తనిఖీలు జరిపి నాసిరకం బియ్యం నిల్వలను గుర్తించి దిగుమతి కోసం గోడౌన్ వద్ద సిద్ధంగా ఉన్న రెండు లారీల్లోని బియ్యాన్ని సంబంధిత రైస్ మిల్లర్ కు రిటన్ చేసిన విషయం తెలిసిందే. అయితే అధికారుల తనిఖీల్లో చలపర్తి గోదాములో సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలు, కళాశాలు, అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసే సన్న బియ్యం కోసం ఖానాపురం మండలానికి చెందిన రైస్ మిల్లర్ ఇటీవల డెలివరీ చేసిన సీఎంఆర్ నిల్వలను పరిశీలించగా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. పది శాతం బ్రోకెన్ తో సదరు రైస్ మిల్లర్ డెలివరీ చేసిన సీఎంఆర్ నిలువల్లో ముక్కిన బియ్యం గుర్తించినట్లు తెలిసింది. రైస్ మిల్లర్ నాసిరకం బియ్యాన్ని డెలివరీ చేయటం, వీటిని టీఏ పాసింగ్ చేయడాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. అయితే గోదాములోని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేవని భావిస్తున్న సీఎంఆర్ నిల్వలను సేగ్రిగేషన్ చేస్తున్నట్లు పౌరసరఫరాల అధికారులు వెల్లడించారు. నివేదిక అందిన తర్వాతే చర్యలు ఉంటాయని అన్నారు.

బహుమతిని అందుకుంటున్న సీఎండీ

నుమాయిష్ లో ద్వితీయ బహుమతి

సింగరేణి సీఎండీ బలరాం అభినందనలు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : హైదరాబాద్ నాంపల్లిలో జరిగిన 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)లో సింగరేణి సేవా సమితి ఏర్పాటు చేసిన మహిళా శక్తి మార్కెట్, స్వయం ఉపాధి ఉత్పత్తుల స్టాల్ కు ద్వితీయ బహుమతి లభించింది. నుమాయిష్ లో మొత్తం 2,200కు పైగా స్టాల్స్ ను ఏర్పాటు చేయగా, ఇందులో ప్రభుత్వ విభాగంలో సింగరేణి సేవా సమితి స్టాల్ కు బహుమతి లభించింది. సోమవారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ... సింగరేణి స్టాల్ కు బహుమతి ద్వారా గుర్తింపు రావడం అభినందనీయమన్నారు. 45 రోజుల పాటు సాగిన నుమాయిష్ లో సింగరేణిని లోని 10 ఏరియాలకు చెందిన మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దాదాపు 6 లక్షలకు పైగా విలువ చేసే క్లాత్ బ్యాగులు, జ్యూట్ బ్యాగులు మగ్గంపై తయారీ చేసిన ఉత్పత్తులను విక్రయించారు. తమకు గత 20 ఏళ్లుగా నుమాయిష్ లో స్టాల్స్, హైదరాబాద్ లో వసతి ఏర్పాటు చేస్తున్న సింగరేణి యాజమాన్యానికి సేవా సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

లంచగొండి ఖాకీలు

ఏసీబీ వలలో ముగ్గురు పోలీసులు

- ఇద్దరు ఫారెస్ట్ అధికారులు
- రూ. 20 వేలు తీసుకుంటూ పట్టుబడిన మక్తల్ సీఐ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు శివారెడ్డి, నరసింహ
- రూ. 30 వేలు పుచ్చుకుంటూ అడ్డంగా బుక్కైన కొమురారం రేంజర్ ఉదయ్‌కిరణ్, బీట్ ఆఫీసర్ హరిలాల్
- ఒక్క రోజే ఐదుగురు ఉద్యోగుల ఆటకట్టు..
- గత నెలలో పట్టుబడిన తొర్రూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్..
- కలకలంరేపుతున్న అవినీతి నిరోధక శాఖ దాడులు
- అయినా మారని లంచావతారులు

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: అవినీతి అధికారులపై ఏసీబీ కొరడా ఝులిపిస్తోంది. లంచావతారుల భరతం పడుతూ ఆటకట్టిస్తోంది. ఇటీవల వరుస సోదాలు, ఆకస్మిక దాడులతో అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టిస్తోంది. అయితే.. అధికారులు ఎన్ని దాడులు చేస్తున్నా.. లంచగొండి ఆఫీసర్లలో మాత్రం మార్పు రావడంలేదు. ఏదో ఒకచోట ఏసీబీ వలకు చిక్కుతూనే ఉన్నారు. తాజాగా సోమవారం రాష్ట్రంలో ఐదుగురు ఉద్యోగులు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నారాయణపేట జిల్లా మక్తల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు శివారెడ్డి, నరసింహతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఫారెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని కొమురారం రేంజర్ ఉదయ్‌కిరణ్, బీట్ ఆఫీసర్ నునావత్ హరిలాల్ ఏసీబీకి చిక్కడం కలకలం రేపింది.

రూ. 20 వేలు తీసుకుంటూ సీఐ..

నారాయణపేట జిల్లా మక్తల్‌లో సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఓ కేసులో రూ. 20 వేలు లంచం తీసుకుంటూ మక్తల్ సీఐ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు శివారెడ్డి, నరసింహ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. సీఐ చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు బాధితుడి నుంచి తీసుకున్న నగదును రికవరీ చేశారు.

ధైర్యంగా ఫిర్యాదు చేయండి..

లంచం డిమాండ్ చేస్తున్న అధికారులు, సిబ్బందిపై గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో ఫిర్యాదులు పెరిగాయి. నేరుగా ఏసీబీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నవారు కొందరైతే, ఆకాశరామన్న ఉత్తరాలు రాసి ఉప్పందిస్తున్నవారు మరికొందరు. ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫిర్యాదులు చేసే వారు మరికొందరు. టెక్నాలజీ వాడకం పెరిగిన నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా కూడా ఫిర్యాదులు అందుతున్నాయి. తెలంగాణ ఏసీబీ పేరుతో ఫేస్ బుక్, ఎక్స్ ఖాతాలకు ఫిర్యాదులు, అవినీతి అధికారుల సమాచారం అందుతోందని ఆశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిపై ప్రజలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని వారు భరోసా ఇస్తున్నారు.

రూ. 30 వేలు పుచ్చుకుంటూ రేంజర్..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఫారెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని కొమురారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉదయ్ కుమార్, బీట్ ఆఫీసర్ నూనావత్ హరిలాల్ ఏసీబీకి చిక్కారు. ఫారెస్ట్ భూమి నుంచి మట్టి తవ్వుకునేందుకు రైతు నుంచి రూ. 30 వేలు డిమాండ్ చేయగా, ఏసీబీని ఆశ్రయించాడు. దీనిపై సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు ఇల్లందు మండలం కొమురారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్‌లో దాడులు నిర్వహించి ఇద్దరు అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

గతనెలలో తొర్రూరు సర్కిల్ ఇన్ స్పెక్టర్..

గత నెల 6న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు సీఐ జగదీష్ ఏసీబీకి పట్టుబడిన సంగతి తెలిసిందే. రేషన్ బియ్యం పట్టుబడిన కేసులో వ్యాపారిని సీఐ డబ్బులు డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి సీజ్ చేశారు. సీజ్ చేసిన లారీని విడిచి పెట్టేందుకు తొర్రూరు సీఐ జగదీశ్ బియ్యం వ్యాపారిని రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్టు ఆరోపణలున్నాయి. వ్యాపారి రూ.2 లక్షలు అందజేయగా, మరో రూ. 3 లక్షల కోసం సీఐ డిమాండ్ చేయడంతో బియ్యం వ్యాపారి ఏసీబీని ఆశ్రయించారు.

పంచాయతీల నిర్వహణ భారంగా ఉంది

- నిధులను విడుదల చేయండి
- కార్యదర్శుల ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతి పత్రం అందజేత

అక్షర దర్బార్, కేసముద్రం : పంచాయతీల నిర్వహణ భారంగా ఉందని గతేడాది ఆగస్టు నుంచి నిధులు లేక పారిశుద్ధ్య నిర్వహణ, నీటి సరఫరా వంటి పనుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పంచాయతీ కార్యదర్శుల ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కొట్టూరి రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేయాలని కోరుతూ మండల పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మంగళవారం కేసముద్రం ఎంపీడీవో క్రాంతికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ.. ఐఎఫ్ఎంఎస్ పెండింగ్ లో ఉన్న చెక్కులను, ట్రెజరీకి అనుసంధానం లేకుండా నేరుగా చెల్లింపులు జరిపే అవకాశం కల్పించాలని కోరారు. నిధులు లేక గ్రామ పంచాయతీలోని ఏ సమస్యను పరిష్కరించలేకపోతున్నామని తక్షణమే నిధులను విడుదల చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఇసంపల్లి నాగార్జున, రాజు, కోలా దుర్గయ్య, రఘువీర్, శైలజ, అరుణ్ జ్యోతి, రమ్య, మంజుల, నివాస్ రెడ్డి, వినయ్, శ్రీనివాస్, రాజేష్, వినోద్, వాణి, స్వరూప పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పరకాల మండల కమిటీ ఎన్నిక

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ పరకాల మండల మహాసభ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మడికొండ ప్రశాంత్, కార్యదర్శిగా కోగిల ప్రేమ్, ఉపాధ్యక్షులుగా గౌతమ్ కుమార్ , ప్రశాంత్, సహాయ కార్యదర్శులుగా అనిల్ , గణేష్, సభ్యులుగా సాయి, నాని, సిద్దు, దివ్య, మానస, అంజలి, నందిని, కావ్యశ్రీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ హేమంత్ ,బొచ్చు ఈశ్వర్, చెన్నూరి సాయి కుమార్, యశ్వంత్ పాల్గొన్నారు.

నాచినపల్లి విద్యార్థి ఆవిష్కరణకు గుర్తింపు

జాతీయస్థాయికి ఎంపికైన రిషిక్

అక్షర దర్బార్, దుగ్గొండి : కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్ ఇన్నోవేషన్ కాంటెస్ట్ లో దుగ్గొండి మండలం నాచినపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఆవిష్కరణకు కేంద్ర స్థాయిలో గుర్తింపు లభించిందని పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు, గైడ్ టీచర్ సుమలత మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థి రిషిక్ రూపొందించిన ఎటీబీ (ఎనీ టైం బ్యాగు) ఆవిష్కరణ ఎంపికైనట్లు తెలిపారు. ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు వాడేలా రూపొందించిన ఎనీ టైం బ్యాగ్ ఆవిష్కరణ ప్రొఫెసర్ల ప్రశంసలు పొందినట్లు తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థి మిస్సింగ్ పై విచారణ చేపట్టాలి

ఎస్సైని కలిసిన ఏబీఎస్ఎఫ్ నాయకులు

అక్షర దర్బార్, ఖానాపురం : ఖానాపూర్ మండలంలోని అశోక్ నగర్ గిరిజన సైనిక్ స్కూల్ ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి వజ్జ సాయి వర్ధన్ మిస్సింగ్ పట్ల విచారణ చేపట్టాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బోట్ల నరేష్, జిల్లా అధ్యక్షులు అఖిల్ ఎస్సై రఘుపతిని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థి మిస్సింగ్ పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.

మంగళవారం
18.02.2025
www.aksharadarbar.com

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

పట్టాలిప్పిస్తామని ఎర!

- దళారులకు కేరాఫ్ గా మారిన సర్వే నెం 399/1
- 75 ఎకరాల ఫారెస్ట్ భూమిని చూపుతూ దోపిడీకి యత్నం
- ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు వసూళ్లు

అక్షర దర్బార్, కేసముద్రం : ఫారెస్ట్ భూమికి పట్టాలు వస్తాయని అమాయక ప్రజలను మోసం చేసేందుకు దళారులు కుట్రకు తెరలేపారు. పోడు భూములకు గతంలో పట్టాలిప్పించినట్లుగానే మిగిలిన ఫారెస్ట్ భూమికి కూడా పట్టా చేయిస్తామని సిండికేట్ గ్యాంగ్ లక్షల్లో వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని విలేజ్ కేసముద్రం లోని సర్వే నెం.399/1లో 75 ఎకరాల ఫారెస్ట్ భూమి ఉంది. అయితే ఈ భూమి భూక్యారం తండా, మహమూద్ పట్నం సమీపంలో ఉండడంతో దళారులు ఈ గ్రామ అమాయక రైతులకు వల వేస్తున్నారు. తమకు అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని, మీ పేరు పట్టా చేయిస్తామని రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు వసూళ్లకు యత్నిస్తున్నట్లు అక్కడి ప్రజలు చెబుతున్నారు. గతంలో సైతం దళారుల చేతిలో మోసపోయిన రైతులు ఫిర్యాదులు చేసినా అప్పటి అధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. తాజాగా ఈ భూమిపై కన్నేసిన అధికార పార్టీకి చెందిన కొంతమంది చోటామోటా నాయకులు అక్రమార్జనకు పూనుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫారెస్ట్ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని పలు స్వచ్ఛంద సంస్థలు డిమాండ్ చేస్తున్నారు.

తప్పుడు పత్రాలు సృష్టించి..

తప్పుడు పత్రాలు సృష్టిస్తూ ఈ తతంగానికి తెరలేపుతున్నట్టుగా స్థానికుల ద్వారా తెలియవస్తుంది. పోడు భూముల పట్టాలను ఆసరగా చేసుకున్న దళారులు..ఆ కార్యక్రమంలో భాగంగానే ఈ అక్రమ పట్టాల జారీకి తెరలేపారని సమాచారం. పేద బంజారా బిడ్డల నుంచి లక్షలు సొమ్ము చేసుకోవడానికి ఇదే మార్గమని దళారులు కాచుకుకూర్చున్నారు. ఇప్పటికే ఈ తతంగానికి గతంలో పలువురు రైతులు బలైనట్లుగా విశ్వసనీయ సమాచారం. ఈ ల్యాండ్ సర్వే పూర్తి కాగా..అటు పోడు భూములకు బీఆర్ఎస్ ప్రభుత్వం పలువురికి పట్టాలు ఇవ్వడంతో.. తాజాగా.. సర్వే నెం399/1 లో 75 ఎకరాలకు పట్టాలు ఇప్పిస్తామని చెప్పి నగదు కాజేసేందుకు కుట్రలకు తెరలేపారు. అయితే దళారుల వద్ద ఈ భూమి గురించి కనీసం కాస్తుకు సంబంధించిన పత్రాలు కూడా లేని పరిస్థితి ఉందని పలువురు అంటున్నారు. మరి అలాంటిది.. అధికార పార్టీకి చెందిన ఏ నాయకుని నీలి నీడలు ఉన్నాయి..? మరి ఎవరి అండదండలతో ఈ ఎత్తుగడకు తెరలేపారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.బడా రాజకీయ నాయకుల అండదండలతోనే ఈ ఎత్తుగడకు తెరలేపినట్టుగా మండల ప్రజలు చర్చించుకుటున్నారు. అన్యాక్రాంతం కాకుండా ఫారెస్ట్ భూమిని కాపాడాలని పలు స్వచ్ఛంద సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి.గిరిజన పేద బిడ్డల నుంచి భూమిని ఆస్తిగా చూపిస్తూ..చేతులోకి రాని దాన్ని చేతుల్లోనే ఉన్నట్టు కనికట్టు కడుతున్న ఈ దళారులపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇక ఇదిలా ఉంటే.. గతేడాది ఇదే భూమి విషయంలో బాధితులుగా ఉన్నవాళ్లు.. పైఅధికారులకు సైతం ఫిర్యాదు చేశామని చెపుతున్నారు. నాటి నుంచి నేటి వరకు ఎలాంటి పరిష్కారం కాకపోగా.. ఇప్పుడు అధికార పార్టీకి చెందిన మరికొంత మంది నెత్తిన టోపీ పెట్టేందుకు ప్రస్తుత రాజకీయ పక్షాల నేతలతో చేతులు కలిపిన దళారులు కుట్రలకు తెరలేపారు. మరి ఫారెస్ట్ భూమి అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు చేపడతారా లేదా వేచి చూడాల్సిందే మరీ..

ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు పెంచాలి

అక్షర దర్బార్, మహబూబాబాద్ : బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు పెంచాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజెందర్ ని మహబూబాబాద్ లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు మాట్లాడుతూ.. బీసీలకు చట్టసభల్లో స్థానాలు పెంచేలా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎంపీ ఈటల రాజేందర్ ని కోరారు. లక్ష కోట్లతో బీసీ బ్యాంక్ ఏర్పాటు చేసి బీసీల అభ్యునతికి కృషి చేయాలని కోరారు.

మహా కుంభమేళాలో సోదా రామకృష్ణ

అక్షర దర్బార్, పరకాల: ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళాలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ పాల్గొని పుణ్య స్నానాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట వాల్మీకి రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి, మార్క జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియత్రణకు పటిష్ఠ చర్యలు

- ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి
- భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : నేరాల నియంత్రణ కోసం పోలీసు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించి, పోలీస్ స్టేషన్ల వారీగా రిపోర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అక్రమంగా ఇసుక రవాణా చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ఏదైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందేలా చూసుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి ఇతర మత్తు పదార్థాలపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని, మహిళల పట్ల నేరాలపై వేగంగా స్పందించి, న్యాయం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తరుచూ జరిగే చోటును హాట్ స్పాట్ గా గుర్తించి, ప్రమాదాలకు గల కారణాలను తెలుసుకుని పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఆర్ ఆదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, వర్టికల్ డీఎస్పీ నారాయణ నాయక్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



కారులో వర్గపోరు

- పరకాల బీఆర్ఎస్‌లో గందరగోళం
- ఎవరికి వారే చందంగా నేతల తీరు
- జూనియర్లపై గుర్రుగా సీనియర్లు
- కేసీఆర్ బర్త్‌డే నాడైనా కలవని నాయకులు
- ఇలా అయితే స్థానిక ఎన్నికల్లో కష్టమే ?

అక్షరదర్బార్, పరకాల: పరకాల నియోజకవర్గంలోని కారు పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. నాయకులు ఎవరికి వారే తీరుగా వ్యవహరిస్తుండటంతో కేడర్‌లో గందరగోళం నెలకొంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయి 15 నెలలు అవుతున్నా ఆ పార్టీ లీడర్ల తీరు మారడంలేదు. ఇప్పటికీ వేరు వేరుగానే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు కూడా నాయకులను కలపలేకపోయాయి. ఇలాగా కొనసాగితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మూల్యం చెల్లించే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నాయకత్వ లోపం..

పరకాల నియోజకవర్గంలో పదేండ్లు ఎదురులేని పార్టీగా నిలిచిన బీఆర్ఎస్ నేడు నాయకత్వ లోపంతో చతికిల పడుతోందన్న వాదన బలంగా వినిపిస్తోంది. పరకాల బీఆర్ఎస్‌లో పట్టణ అధ్యక్షుడు లేకపోవడంతో ఎవరికి వారే అన్న చందంగా వ్యవహరించడం పరిపాటిగా మారింది. ప్రతి కార్యక్రమంలో సీనియర్లు, జూనియర్ నాయకులు అలకలతో లుకలుకలు బయట పడుతున్నాయి. అధికార పార్టీపై ప్రజల్లో కొంత వ్యతిరేకత ఉన్నప్పటికీ దానిని అనుకూలంగా మలుచుకోవడంలో బీఆర్ఎస్ వెనుకబడిపోతోందని కేడర్ ఆవేదన చెందుతోంది.

చల్లా దృష్టిసారించాలి

జనవరి 26న పట్టణంలో జెండా ఆవిష్కరణపై కొంతమంది సీనియర్లు గుర్రుగా ఉన్నట్లు ప్రచారం జోరుగా సాగింది. అదేవిధంగా సోమవారం కేసీఆర్ జన్మదిన వేడుకల్లోనూ ఇదే తంతు కొనసాగింది. ఎవరికి వారుగా కేక్ కట్ చేయడంతో గందరగోళం నెలకొంది. కొంత మంది సీనియర్లు ఈ కార్యక్రమానికి దూరంగా ఉండిపోవడం చర్చకు తెరలేపింది. పరిస్థితి ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో కొందరు బీఆర్ఎస్‌ను వీడేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే రంగంలోకి దిగి పరిస్థితులను చక్కదిద్దాలని, పట్టణ అధ్యక్షుడిని నియమించి పరకాలలో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని గులాబీ శ్రేణులు కోరుతున్నాయి.



ఫ్లెక్సీ ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న బాధితులు

ఎస్సై వేధింపులు తట్టుకోలేం..

- ఆత్మహత్యకు అనుమతివ్వండి
- భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట దంపతుల ఆందోళన
- గతంలోనూ ప్రజాదర్బార్‌లో బాధితుల ఫిర్యాదు
- మూడేండ్లుగా వ్యవసాయం చేయనివ్వడంలేదని ఆరోపణ
- అక్రమ కేసులు పెడుతున్నాడని ఆవేదన
- ఇప్పటికైనా న్యాయం చేయాలని వేడుకోలు

అక్షరదర్బార్, భూపాలపల్లి: సార్ ఎస్సై వేధింపులు తట్టుకోలేకపోతున్నాం.. మా భూమిలోకి వెళ్లే బండ్ల బాటను దున్ని తన భూమిలో కలుపుకున్నడు.. అడిగితే అక్రమ కేసులు పెట్టిండ్రు.. మూడేళ్లుగా వ్యవసాయం చేయనీయట్లేదు.. మేము ఆత్మహత్య చేసుకుంటాం.. అనుమతివ్వండి. అంటూ ఓ వృద్ధ దంపతులు సోమవారం భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట ఫ్లెక్సీ పట్టుకొని నిరసనకు దిగడం కలకలం రేపింది. బాధితుల వివరాల ప్రకారం భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం వేములపల్లి గ్రామానికి చెందిన సంది సులోచన, ప్రతాప రెడ్డి దంపతులకు గ్రామంలో 12 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలోకి వెళ్లే బండ్ల బాటను ములుగు జిల్లా కన్నాయిగూడెం ఎస్సై వెంకటేష్ అతడి కుటుంబ సభ్యులు కలిసి రెండున్నర్ ఏండ్ల కింద దున్ని తమ భూమిలో కలుపుకున్నారు. అప్పటి నుంచి దంపతులను భూమిలోకి వెళ్ళనీయకుండా అడ్డుకోవడంతోపాటు అక్రమ కేసులు పెట్టారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2023 డిసెంబర్‌లో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్‌లో దంపతులు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అక్రమ కేసులు పెట్టాడని, దీనివల్ల మూడేళ్లుగా పంట సాగు చేసుకోలేక పోతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన ఆఫీసర్లు సమస్యను పరిష్కరించాలని భూపాలపల్లి అప్పటి కలెక్టర్ భవేశ్ మిశ్రాకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అప్పటి ఆర్డీవో రమాదేవి రెండుసార్లు ఫీల్డ్ విజిట్ చేశారు. పాత రికార్డులు చుట్టుపక్కల రైతుల వాంగ్మూలాలు సేకరించారు. బండ్ల బాటను దున్నినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్సై అతడి తండ్రి సోదరుడితో మాట్లాడారు. ఆ బాటను పునరుద్ధరించాలని గతేడాది జనవరిలో ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్డీవో ఆదేశాలు బేఖాతర్..

లా అండ్ ఆర్డర్‌కు ఇబ్బంది కలగకుండా మొగుళ్లపల్లి తహసీల్దార్, ఎస్సై కలిసి ఇరు వర్గాల సమక్షంలో బాటను పునరుద్ధరించాలని ఆదేశించారు. కానీ ఆర్డీవో ఆదేశాలు ఇప్పటి వరకు అమల్లోకి రాలేదు. బాటను పునరుద్ధరించాలని మొగుళ్ళపల్లి తహసీల్, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవట్లేదని దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సై తన పలుకుబడిన ఉపయోగించే ఆఫీసర్లపై ఒత్తిడి తెస్తూ బాటను పునరుద్ధరించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇక పోరాటం చేయడం ఇక మా వల్ల కాదని చనిపోయేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఫ్లెక్సీ పట్టుకొని కలెక్టరేట్ ఎదుట నిలుచున్నారు. అధికారులు దంపతులతో మాట్లాడి నిరసన విరమింపజేశారు.

పూడిక మట్టి క్యూబిక్ మీటర్ రూ. 72

- భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతం చేయాలి
- అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

అక్షరదర్బార్, హనుమకొండ : భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖల అధికారులను హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం భద్రకాళి చెరువు పూడికతీత పనులను సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. భద్రకాళి చెరువు పూడికతీత పనులు, మట్టి తరలింపు, తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. చెరువు పూడికతీత మట్టిని ఇబ్బందులు లేకుండా తరలించాలన్నారు. మట్టి తరలింపునకు వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అంతర్గత రోడ్లు నిర్మించాలని సూచించారు. మట్టి తరలింపు సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. పనులు జరుగుతున్న చోట్ల రాత్రి వేళలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. మట్టి తరలించే వాహనాల నమోదు కోసం జంక్షన్, చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి రెవెన్యూ, పోలీస్, సాగునీటి పారుదల, మున్సిపల్ శాఖల సిబ్బందితో 24 గంటల పాటు పర్యవేక్షించాలన్నారు. పూడికతీత మట్టి కావాలనుకునే వారు క్యూబిక్ మీటర్ కు రూ. 72 చెల్లించి తీసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, మున్సిపల్, కుడా, సాగునీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ హైకోర్టులో తీవ్ర విషాదం

- వాదిస్తూనే గుండెపోటుతో న్యాయవాది హఠాన్మరణం
- వేణుగోపాలరావు మృతిపై లాయర్ల ఆవేదన

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టులో విషాద ఘటన చోటు చేసుకుంది. కోర్టు హాలులో న్యాయవాది కుప్పకూలిపోవడం తోటి న్యాయవాదులను కలచివేసింది. వివరాల్లోకి వెళితే.. న్యాయవాది వేణుగోపాలరావు 21వ కోర్టు హాలులో ఓ కేసుకు సంబంధించి వాదనలు వినిపిస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలారు. గమనించిన తోటి న్యాయవాదులు వెంటనే అతన్ని అంబులెన్స్‌లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే వేణుగోపాలరావు గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. న్యాయవాది మృతికి సంతాప సూచకంగా 21వ కోర్టులో పిటిషన్ల విచారణను న్యాయమూర్తి నిలిపివేశారు. మిగతా కోర్టుల్లోనూ అత్యవసర పిటిషన్లు, పాస్ ఓవర్ పిటిషన్లను విచారించి.. రెగ్యులర్ పిటిషన్లను వాయిదా వేశారు. సీనియర్ న్యాయవాది మృతితో తోటి లాయర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

హెచ్ఎం ఇష్టారాజ్యం

- అనుమతి లేకుండా పాఠశాలకి గైర్హాజర్
- నెల రోజులుగా అప్ డేట్ చేయని స్టాక్ రిజిస్టర్
- హెడ్ మాస్టర్ తీరుపై తహసీల్దార్ ఆగ్రహం
- ఉన్నతాధికారులకు నివేదిక

అక్షరదర్బార్, వెంకటాపూర్ : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాపయపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తహసీల్దార్ గిరిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్ఎం శ్యాం తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి అనుమతి లేకుండా పాఠశాలకి గైర్హాజర్ అయ్యారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా స్టాక్ రిజిస్టర్ నెల రోజుల నుండి అప్ డేట్ చేయలేదు. రోజువారి మెనూ ప్రకారం భోజనం అందించడం లేదు. వారానికి 3 రోజులు గుడ్డు పెట్టాలని నిబంధనలున్నా ఒక్క గుడ్డు మాత్రమే పెడుతున్నారు. రిజిస్టర్ లోని విద్యార్థుల హాజరుపట్టిక సరిగా నమోదు చేయడం లేదు. పాఠశాల యందు మూత్రశాలలు కూడా పరిశుభ్రంగా ఉంచడంలేదని తెలిపారు. నివేదికను పై అధికారులకు పంపనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కూడా పరిశీలించారు. నల్గొండ-ఖమ్మం-వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ ఎలక్షన్స్ ఈనెల 27న ఉన్నందున పోలింగ్ బూత్-69ని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏ ర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన మౌలిక సదుపాయాల ఏర్పాట్లను తహసీల్దార్ పర్యవేక్షించారు.

ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

డీఎంహెచ్ఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అక్షర దర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ పట్టణంలోని లక్ష్మి నర్సింగ్ హోంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం జిల్లా వైద్యాధికారి నాగరాజుకి కన్స్యూమర్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మంద విక్రమ్ గౌడ్, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నాల యుగంధర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రైవేట్ హాస్పిటల్లో పుట్టిన పిల్లలకు బర్త్ సర్టిఫికెట్ అడిగితే వేలల్లో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కాలం చెల్లిన మెడిసిన్స్ అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మహేందర్ రెడ్డిని పరామర్శించిన పెసరు

అక్షర దర్బార్, పరకాల: పరకాల మండలంలోని కామారెడ్డి పల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నేత కొమ్మిడి మహేందర్ రెడ్డి తల్లి కాంతమ్మ అనారోగ్యంతో మరణించింది. కాగా మహేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి కలిసి పరామర్శించారు. ఆయనవెంట పరకాల మండల అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్ గౌడ్, నాయకులు తండ కుమారస్వామి, ఎదునూరి లింగయ్య, చిర్ర చక్రపాణి, మల్లారెడ్డి, జన్ను లింగయ్య, ప్రమోద్ కుమార్, కొమురయ్య, తడుక సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : aksharadarbarnews@gmail.com, office No : 7680992278★ RNI NO. TELTEL/2022/81915